

ఇఫ్తార్ విందుతో సోదరభావం

జూలపల్లి: ఇఫ్తార్ విందులు ఆత్మీయతను పెంపొందిస్తాయని టీపీసీసీ ఉపాధ్యక్షుడు విజయరమణరావు అన్నారు. రంజాన్ సందర్భంగా స్థానిక గోల్డెన్ ఫంక్షన్ హాల్‌లో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.



సమస్యలు పరిష్కరించండి

సుల్తానాబాద్: తమ సమస్యలు పరిష్కరించాలని మంత్రి దయాకర్‌రావుకు హైదరాబాద్‌లోని ఆయన క్యాంప్ కార్యాలయంలో స్త్రీనిధి ఉద్యోగులు వినతిపత్రం అందించారు. వేతనాలు, బెనిఫిట్స్ అందించాలన్నారు.

గరిష్టం/కనిష్టం
39.0/27.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. పగలు ఎండ వేడి పెరిగే అవకాశముంది

ఇహలోక జీవితం కొన్ని రోజులే - కీర్తిప్రతిష్టలే శాశ్వతమైనవి.

– మహమ్మద్ ప్రవక్త

	ఇఫ్తార్		సహర్
ఆది	6:36	సోమ	4:32

రంజాన్ వేళలు

స్టార్ సిటీ

- సినీ విజయోత్సవాలకు వేదికగా కరీంనగర్
- ఈ ఏడాదిలో ఇప్పటికే నాలుగు సక్సెస్ మీట్‌లు

సండే స్పెషల్

కరీంనగర్ అంటేనే ఉద్యమాలకు వేదిక. కళలకు పుట్టినిల్లు. ఎందరో మహానుభావులు కరీంనగర్ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో చాటిచెప్పారు. ఉద్యమాలే కాదు.. సినీరంగంలోనూ నగరానికి మొదటినుంచి ప్రత్యేకస్థానం ఉంది. హైదరాబాద్, వరంగల్ తరువాత కరీంనగర్‌లోనే సినిమాలకు సంబంధించిన ప్రీరిలీజ్ ఫంక్షన్లు, ఆడియో రిలీజ్ వేడుకలు, విజయోత్సవాలు ఎక్కువగా నిర్వహిస్తున్నారు. సినీ ప్రస్థానంలో 60 ఏళ్ల నుంచి విజయోత్సవాలకు కరీంనగర్ వేదికైంది. నాటి 'సువర్ణసుందరి' నుంచి నేటి 'దసరా' వరకు ప్రతీ విజయాన్ని సినీ హీరోలు నగర ప్రజలతో పంచుకుంటున్నారు. ఓ వైపు స్మార్ట్‌సిటీగా అభివృద్ధి చెందుతున్న నగరంలో.. అప్పుడప్పుడు స్టార్స్ కూడా వచ్చి తళుక్కున మెరుస్తున్నారు. కరీంనగర్‌లో వెండితెర వెలుగులపై సండే స్పెషల్..!! – విద్యానగర్(కరీంనగర్) - 8లో



బాలభవన్ చిన్నారులతో బలగం చిత్ర యూనిట్

న్యూస్‌రీల్

అగ్ని ప్రమాదాల నివారణకు విస్తృత ప్రచారం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అగ్నిమాపక అధికారి

జ్యోతినగర్: అగ్ని ప్రమాదాల నివారణకు జిల్లావ్యాప్తంగా విస్తృత ప్రచారం చేస్తున్నామని పెద్దపల్లి డివిజన్ అగ్నిమాపక అధికారి దేవనంది శ్రీనివాస్ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, నియంత్రణకు కార్యాచరణపై పెద్దపల్లి బస్‌స్టేషన్, రైల్వే స్టేషన్లలో అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలకు కారణాలు, సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాల నివారణపై వివరించారు. పోస్టర్లు, కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రవణ్ కుమార్, శ్రీనివాస్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

పత్తిలో తేమ 12శాతానికి మించొద్దు

జ్యోతినగర్: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డుకు తెచ్చే పత్తిలో తేమ 12శాతానికి మించి ఉండొద్దని, ఉదయం 8.30గంటల లోపు మాత్రమే మార్కెట్‌కు తేవాలని జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. మార్కెట్ గేట్ వద్ద తేమ కొలిచే యంత్రంతో చూస్తారని, 12శాతానికి మించి తేమ ఉంటే పత్తితో వచ్చిన వాహనాలను తిప్పి పంపిస్తామని పేర్కొన్నారు. ఈ విషయంలో రైతులు సహకరించాలని కోరారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న రావుల రాజేందర్

సుల్తానాబాద్: బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలో అసెంబ్లీ నియోజకవర్గస్థాయి సమావేశాన్ని అసెంబ్లీ కన్వీనర్ దాడి సంతోష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి రావాలంటే బీఆర్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు ఎప్పటికప్పుడు వివరించాలని సూచించారు. సశక్తికరణ్ అభియాన్‌లో ప్రతి కార్యకర్త భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు. పార్లమెంట్ ప్రభారి విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్, పార్లమెంట్ విస్తారక్ సురేశ్, జిల్లా నాయకులు తంగడ రాజేశ్వరరావు, పోలుసాని సంపత్‌రావు, అమరగాని ప్రదీప్, గూడెం జనార్దన్‌రెడ్డి, కారంగుల శ్రీనివాస్, కొప్పుల మహేశ్, ఎర్రోళ్ల శ్రీకాంత్, మర్రెత్తుల ఆంజనేయులు, ఉప్పుకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరి బ్రిడ్జిపై ఫెన్సింగ్ నిర్మించండి



ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు


కోల్‌సిటీ: గోదావరిఖని సమీపంలోని గోదావరి బ్రిడ్జిపై ఫెన్సింగ్ నిర్మించాలని సామాజిక కార్యకర్తలు ప్లకార్డులు, నల్ల బెలూన్లతో బ్రిడ్జి వద్ద శనివారం నిరసనకు దిగారు. బ్రిడ్జి ఆత్మహత్యలకు కేంద్రంగా మారిందన్నారు. ఫెన్సింగ్ ఏర్పాటుపై కార్పొరేషన్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, కేశోరాం, సింగరేణి తదితర సంస్థలు ఉన్నా ఫెన్సింగ్ నిర్మాణానికి ముందుకు రాకపోవడం దురదృష్టకరమన్నారు. స్థానిక ఎమ్మెల్యే కోరుకంటి చందర్, నగర మేయర్ అనిల్‌కుమార్ ప్రత్యేక చొరవ తీసుకొని ఫెన్సింగ్ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు మద్దెల దినేశ్, రేణిగుంట్ల నరేంద్ర, బూడిద హర్ష, సీహెచ్.వివేక్, వెంకటేశ్, నివాస్, కార్తీక్, రాజు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్క క్షణం..!

ఈనెల 7న ధర్మారం మండలం రచ్చపల్లికి చెందిన ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మద్యానికి బానిసై కుటుంబసభ్యులతో గొడవపడటంతో భార్యాపిల్లలు ఇంటి నుంచి వెళ్లిపోయారు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లోనే ఉరేసుకున్నాడు. ఇలా పంతాలు.. పట్టింపులతో చాలామంది క్షణికావేశంలో ప్రాణాలు తీసుకుంటున్నారు. ఇలాంటి సంఘటనలు జిల్లాలో రోజురోజుకూ పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

- చావుకెందుకు తొందర.. విలువ తెలుసుకో ముందర
- పంతాలు.. పట్టింపులతో అఘాయిత్యాలు వద్దు..
- క్షణికావేశ నిర్ణయాలతో కుటుంబాలు చిన్నాభిన్నం
- జిల్లాలో కలవరపెడుతున్న ఘటనలు

ఈనెల 6న కమాన్‌పూర్ మండలకేంద్రంలోని బాపూజీనగర్‌కు చెందిన ఒక వ్యక్తి అవమానం భరించలేక ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.



ఆత్మహత్యల వివరాలు

2018	109
2019	182
2020	111
2021	303
2022	209
2023(ఇప్పటివరకు)	44

సాక్షి, పెద్దపల్లి: చదువులో ఒత్తిళ్లు, నిరుద్యోగం, ప్రేమ, ఆర్థిక సమస్యలు, కుటుంబ కలహాలు, వివాహేతర సంబంధాలు.. ఇలా కారణమేదైనా సమస్యలతో జిల్లాలో రెండు మూడ్రోజులకొకరు ప్రాణాలు తీసుకుంటున్నారు. క్షణికావేశంలో బలవన్మరణాలకు పాల్పడుతూ కుటుంబాలను విషాదంలో ముంచుతున్నారు. భార్యాభర్తల్లో ఎవరో ఒకరు దూరమై పిల్లలు అనాథలవుతున్నారు. ఎవరికి లేని బాధలు తమకే వచ్చాయని భావించి కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఎవరూ అండగా లేరని ఆత్మన్యూనతకు లోనవుతూ ప్రాణాలు తీసుకుంటున్నారు. 'చనిపోయేందుకు ఎంతో ధైర్యం కావాలి. అందులో కాస్త ధైర్యం కూడబలుక్కుని సమస్యలు ఎదుర్కొంటే ఆ తర్వాత జీవితం సానుకూల ధోరణితో సాగుతుంది..' అని మానసిక నిపుణులు సూచిస్తున్నారు.

గేట్‌కీపర్స్ పాత్ర ముఖ్యం..

ఇక బతకలేనని నిర్ణయించుకునే వారు తరచూ కుటుంబసభ్యులతో.. అప్పుడప్పుడూ స్నేహితుల వద్ద నైరాశ్యం వ్యక్తం చేస్తుంటారు. ఆ సంకేతాలను పట్టించుకుని బాధితుల్లో మనోధైర్యం నింపాలి. ఇలా వారిని గేట్‌కీపర్స్ అంటారు. అయితే ఆత్మహత్య చేసుకునే చాలామందికి ఈలాంటి గేట్‌కీపర్స్ కరువై ప్రాణాలు తీసుకుంటున్నారు.

ఇలాంటి వ్యక్తులు ఆత్మహత్యలకు పాల్పడుతారు

- ఆత్మవిశ్వాసం కోల్పోయినట్లనిపించే వ్యక్తులు
- చదువులో వెనుకబడి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చలేకపోతున్నామనే విద్యార్థులు
- మత్తుపదార్థాలకు అలవాటుపడిన వ్యక్తులు
- సమాజంలో పరువుపోతుందేమో..? ఎదుటి వారు తప్పుగా మాట్లాడుకుంటారేమో అనుకునే వ్యక్తులు
- కుటుంబం, ఆస్తి తగాదాలు, ఆర్థిక ఇబ్బందులు, వివాహేతర సంబంధాలు, భార్యాభర్తల మధ్య ఒకరిపై మరొకరికి నమ్మకం లేని వ్యక్తులు ఇలాంటి ఘటనలకు పాల్పడుతుంటారు.

ఈ లక్షణాలుంటే అనుమానించాల్సిందే..

- ఒకచోట కుదురుగా ఉండకుండా అటూఇటూ తిరుగుతుండటం
- ఏ పనిమీదా ఆసక్తి చూపకపోవడం, చేసే పని మీద ఆసక్తి లేకపోవడం
- ప్రతి చిన్న విషయానికీ ఎదుటి వారిపై ఆగ్రహం వ్యక్తం చేయడం
- చీకటిలో ఎక్కువ సమయం గడపడం.. దిగాలుగా, దుఃఖంతో ఉండటం
- ఎవరిని కలువకుండా ఒంటరిగా ఉండేందుకు ఇష్టపడటం. అనుకున్నది సాధించలేకపోయామనే నిర్వేదం.

భరోసా కల్పించాలి



ఆత్మహత్య చేసుకునే వారిలో 18నుంచి 30ఏళ్లలోపు వారి సంఖ్యనే అధికంగా ఉంటుంది. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులకుతోడు జీవితంలో తాను ఏమీ సాధించలేదనే ఆత్మన్యూనత భావనతోనూ ఊపిరి తీసుకుంటున్నారు. మనోబలం తక్కువగా ఉన్నవారే ప్రాణాలు కోల్పోతుంటారు. నిరాశపూరిత మాటలు మాట్లాడటం చేస్తే వెంటనే అప్రమత్తం కావాలి. చిన్నారులకు ప్రాథమిక స్థాయి నుంచే ఓటమిని ఎదుర్కోవడం నేర్పాలి. ఏ సమస్య వచ్చినా తల్లిదండ్రులతో చర్చించే వాతావరణం ఇంట్లో ఉండాలి.

– డాక్టర్ ప్రదీప్, సీనియర్ రెసిడెంట్, మానసిక వైద్య నిపుణుడు, రామగుండం

నిర్బంధం నుంచి కార్మికుల విముక్తి



కూలీలను స్వగ్రామానికి పంపుతున్న అధికారులు

సుల్తానాబాద్: పెద్దపల్లి మండలం రంగాపూర్‌లోని ఇటుకబట్టీల్లో నిర్బంధంలో ఉన్న పలువురు కార్మికులను సీఐడీ అధికారులు విముక్తి చేశారు. ఇటుకబట్టీల్లో నిర్బంధించిన కార్మికులను గుర్తించి అడిషనల్ డీజీపీ మహేష్‌భగవత్ ఆదేశాలతో శనివారం వారిని స్వగ్రామాలకు పంపించినట్లు సీఐడీ రీజినల్ ఇన్స్‌పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. ఒడిశా రాష్ట్రంలోని కేందుముందిబొల్లంగిర్ జిల్లా గడియజోరు గ్రామానికి చెందిన నైలాబారిక్, లాభబెన్యూమ్యాస్, సూపూర్ బెన్యూయాస్, నువ్ర బరిక్, సీమ బారిక్, రష్మిత భారిక్, సుస్మితభారిక్, రస్మితాభారిక్, సుస్మితాభారిక్, ఉదయాస్, పుష్పను వారివారి గ్రామాలకు పంపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐడీ అధికారులు తిరుపతిరెడ్డి, ఎస్సై మల్లేశం, ఉమెన్ ఏఎస్సై పద్మ, హెడ్‌కానిస్టేబల్ చంద్రశేఖరరావు, పెద్దపల్లి సీఐ ప్రదీప్ కుమార్, ఎస్సై శ్రీనివాస్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రాములు, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ జితేందర్, ఆర్ఐ నవీన్‌రావు ఉన్నారు.

మెరిట్ అభ్యర్థులకు న్యాయం చేయండి

సుల్తానాబాద్: జిల్లాకేంద్ర ఆసుపత్రిలో పలు పోస్టుల్లో అనర్హులను ఎంపిక చేశారని, మెరిట్ అభ్యర్థులకు న్యాయం చేయాలని కలెక్టర్ సంగీతకు కొందరు శనివారం విన్నవించారు. రేడియాలజిస్ట్, పాథాలజిస్ట్, ల్యాబ్‌మేనేజర్, బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ పోస్టుల్లో కాంట్రాక్టు పద్ధతిన ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానించారని, స్థానికత, మెరిట్ ఆధారంగా అర్హులను గుర్తించాలని సమ్మయ్య, పులిపాక రవి, మాతంగి వెంకటేశ్, అమరగుండ రాజ్‌కుమార్, శశి, వెంకటేశ్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

భట్టి పాదయాత్రకు భారీగా తరలిరండి

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ ఠాకూర్

రామగుండం: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్ర ఆదివారం ఎల్లంపల్లి ప్రాజెక్టు మీదుగా రామగుండంలోని ఎల్లంపల్లికి చేరుతుందని, పార్టీ శ్రేణులు, వైఎస్సార్ అభిమానులు భారీగా తరలిరావాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ ఠాకూర్ కోరారు. శనివారం అంతర్గాంలో విలేకరులతో మాట్లాడారు. మంచిర్యాల జిల్లా కేంద్రం నుంచి సాయంత్రం ఎల్లంపల్లి మీదుగా ముర్మూర్, బ్రాహ్మణపల్లి, ఆకెనపల్లికి చేరుకుంటారని, రాత్రి ఆకెనపల్లిలో బస చేస్తారని పేర్కొన్నారు. మరుసటి రోజు ఎగ్లాస్‌పూర్ మీదుగా కండె రహదారి నుంచి పాలకుర్తి మండలం పుట్నూర్‌కు చేరుకుంటారని వివరించారు. తలాపునే గోదావరి నది ఉన్నా.. కనీసం స్వచ్ఛమైన తాగునీటి సరఫరా చేయకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భూములిచ్చిన నిర్వాసితుల పొలాలు, మిగులు భూములకు సాగు నీరందడం లేదన్నారు. పార్టీ ప్రతినిధులు పెండ్యాల మహేశ్, ఉరిమెట్ల రాజలింగం, పెండ్రు హన్మాన్‌రెడ్డి, రమేశ్, మడ్డి తిరుపతిగౌడ్, అప్పాల రాజేందర్, గుంట బాపు, సింగం కిరణ్‌కుమార్‌గౌడ్, బర్పటి శ్రీనివాస్, గోపాల్‌యాదవ్, గాదె సుధాకర్ తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్‌ఠాగూర్

జిల్లాలో ఆరురోజులపాటు భట్టి యాత్ర

గోదావరిఖని: భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్ర జిల్లాలో ఆరు రోజులపాటు కొనసాగుతుందని రాజ్‌ఠాగూర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని పాదయాత్ర విజయవంతం చేయాలన్నారు. పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలందించాలి

మంథని: మంథని సామాజిక వైద్యశాల, మాతాశిశు ఆస్పత్రిలో మెరుగైన వైద్యం, సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు సూచించారు. శనివారం క్యాంపు కార్యాలయంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ కంది శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సమీక్షించారు. ఆస్పత్రులను శుభ్రంగా ఉంచాలని, రోగులకు అసౌకర్యం కలిగించొద్దని, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. ఎండతీవ్రత ఎక్కువైనందున ఎయిర్ కూలర్స్, రిఫ్రిజిరేటర్లు కల్పించాలన్నారు. మంథని ఆస్పత్రికి రెండేళ్లుగా నిధులు కేటాయించడం లేదని, కలెక్టర్ స్పందించి నిధులు కేటాయించాలని వినతిపత్రం ద్వారా కోరారు. శానిటేషన్ సిబ్బందికి ప్రభుత్వం వేతనాలు మంజూరు చేయాలన్నారు.

ఉద్యమాలకు అండగా సీఐటీయూ



సేకరించిన నిధిని అందిస్తున్న నాయకులు

సుల్తానాబాద్: సామాజిక ఉద్యమాలకు సీఐటీయూ అండగా నిలుస్తుందని యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి అన్నారు. జిల్లాకేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో మాట్లాడారు. ముందుగా జిల్లాలోని కార్మికుల నుంచి సేకరించిన రూ.10వేల సంఘీభావ నిధిని కార్యాలయంలో అందించారు. అనంతరం మాట్లాడుతూ సమాజంలో దళితులపై కులవివక్ష, అంటరానితనం, దాడులు, దౌర్జన్యాలు కొనసాగుతున్నాయని, వాటికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. హక్కులు, సమస్యల పరిష్కారం కోసం కార్మికులు పోరాడాలని, ఉద్యమాలకు అండగా నిలబడాలనే ఉద్దేశంతోనే నిధి సేకరిస్తున్నామని, రాష్ట్ర కమిటీ ద్వారా సామాజిక సమస్యలపై పోరాడుతున్న కేవీపీఎస్ వంటి సంస్థలకు అందిస్తామని స్పష్టం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న మనువాద సిద్ధాంత విధానాలతో ప్రజల సమస్యలు పక్కదారి పట్టిస్తోందని మండిపడ్డారు. జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ జిల్లాలో సామాజిక సమస్యలపై సీఐటీయూ ఉద్యమిస్తుందని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్, జిల్లా అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి, నాయకులు రామాచారి, జి.జ్యోతి, డి.కొమరయ్య, ఎన్.భిక్షపతి, సిహెచ్.అరవింద్ పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఖాతాల్లోకే నగదు బదిలీ చేయాలి

- రాష్ట్ర ప్రధానకార్యదర్శి తిరుపతియాదవ్



మాట్లాడుతున్న తిరుపతి యాదవ్

సుల్తానాబాద్: గొర్రెల పంపిణీలో లబ్ధిదారులకు నేరుగా వారి ఖాతాలోనే నగదు బదిలీ చేయాలని గొర్రెల కాపర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో రైతుబంధు, దళితబంధు పథకాన్ని అమలు చేస్తున్నట్టుగానే రెండోవిడుత గొర్రెల పంపిణీ పథకాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. పశుసంవర్ధక శాఖ, గొర్రెల, మేకల ఫెడరేషన్ ఆధీనంలో ఉన్న గొర్రెల, మేకల మార్కెట్ యార్డుల్లో రెండోవిడత గొర్రెల పంపిణీ చేపట్టాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు వేల్పుల నాగరాజ్ యాదవ్ మాట్లాడుతూ 18 తీర్మానాలను ప్రభుత్వం ఆమోదించాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల నర్సయ్య యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిని లక్ష్మణ్ యాదవ్, నాయకులు దాడి చంద్రమొగిలి, మ్యాదరవేని లింగయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

నియామకం



నియామక పత్రం అందుకుంటున్న శంకర్

గోదావరిఖనిటౌన్(రామగుండం): హ్యూమన్ రైట్స్ కౌన్సెలర్ జిల్లా కన్వీనర్‌గా గోదావరిఖనికి చెందిన జాతీయ యువజన అవార్డు గ్రహీత ఈదునూరి శంకర్‌ను నియమించినట్లు రాష్ట్ర హ్యూమన్ రైట్స్ కౌన్సెలర్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ టి.సుబాషిని పేర్కొన్నారు. ఈమేరకు శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా శంకర్‌ను హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫౌండర్ సెక్రెటరీ మంత్రి శ్యాంప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి సతీశ్‌చంద్ర తదితరులు అభినందించారు.

25 శాతం పెనాల్టీతో ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని డీ అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్ చెల్లింపుదారులందరూ వెంటనే నిర్ణీత రుసుం చెల్లించి 2023–24 ఆర్థిక సంవత్సరానికి రెన్యూవల్ చేసుకోవాలని నగరపాలక కమిషనర్ బి.సుమన్‌రావు కోరారు. ఈ ఏడాది మార్చి 31తో గడువు తేదీ దాటినందున 25 శాతం పెనాల్టీతో జూన్ 31 వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. స్పందించకుంటే జూలై 1 నుంచి 50 శాతానికి పెనాల్టీ పెరుగుతుందన్నారు. రామగుండం నగరపాలక పరిధిలో సుమారు 1,600 వ్యాపార సంస్థలు డీ అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ చేసుకోవాల్సి ఉందని తెలిపారు. వివరాలకు బల్దియా కార్యాలయ పని వేళల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆర్.నాగభూషణం (98669 62708), జె.సునీల్‌కుమార్ (85228 54404)ను సంప్రదించాలని కమిషనర్ సూచించారు.

అన్ని వర్గాల మనోభావాలను గౌరవిస్తున్న కేసీఆర్



ఇఫ్తార్‌లో పాల్గొన్న పుట్ట మధు

మంథని: అన్ని వర్గాల మనోభావాలను గౌరవించే ఏకైక పార్టీ బీఆర్‌ఎస్ అని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా మంథనిలోని జామా మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నాడు కాంగ్రెస్ పార్టీ మైనార్టీలను పట్టించుకోలేదని, కేవలం ఓటు బ్యాంకుగానే చూశారన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో ముస్లిం మైనార్టీలకు పెద్దపీట వేయడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ముస్లిం మైనార్టీలకు ప్రత్యేకంగా గురుకుల పాఠశాలను నెలకొల్పి వారి భవిష్యత్తుకు బాటలు వేశారన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు బట్టలు పంపిణీ చేశారు. ఎంపీపీ కొండ శంకర్, జెడ్పీటీసీ తగరం సుమలత, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి తదితరులు ఉన్నారు.

స్టార్ సిటీ

సినీ విజయోత్సవాలకు వేదికగా మన స్మార్ట్‌సిటీ



దసరా సినిమా విజయోత్సవ సభలో హీరో నాని



బలగం సినిమా విజయోత్సవ వేడుక



90ఎంఎల్ ప్రీ రిలీజ్ వేడుక

సండే స్పెషల్

- నాటి 'సువర్ణసుందరి' నుంచి నేటి 'దసరా' వరకు..
- కరీంనగర్ వాసులతో వెండితెర హీరోల సంబరాలు
- అప్పుడు వైశ్యభవన్.. ఇప్పుడు క్రీడా మైదానాలు
- ఈ ఏడాదిలో ఇప్పటికే నాలుగు సక్సెస్ మీట్‌లు

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ అంటేనే ఉద్యమాలకు వేదిక. కళలకు పుట్టినిల్లు. ఎందరో మహానుభావులు కరీంనగర్ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో చాటిచెప్పారు. ఉద్యమాలే కాదు.. సినీరంగంలోనూ నగరానికి మొదటినుంచి ప్రత్యేకస్థానం ఉంది. హైదరాబాద్, వరంగల్ తరువాత కరీంనగర్‌లోనే సినిమాలకు సంబంధించిన ప్రీరిలీజ్ ఫంక్షన్లు, ఆడియో రిలీజ్ వేడుకలు, విజయోత్సవాలు ఎక్కువగా నిర్వహిస్తున్నారు. సినీ ప్రస్థానంలో 60 ఏళ్ల నుంచి విజయోత్సవాలకు కరీంనగర్ వేదికైంది. నాటి 'సువర్ణసుందరి' నుంచి నేటి 'దసరా' వరకు ప్రతీ విజయాన్ని సినీ హీరోలు నగర ప్రజలతో పంచుకుంటున్నారు. ఓ వైపు స్మార్ట్‌సిటీగా అభివృద్ధి చెందుతున్న నగరంలో.. అప్పుడప్పుడు స్టార్స్ కూడా వచ్చి తళుక్కున మెరుస్తున్నారు. కరీంనగర్‌లో వెండితెర వెలుగులపై సండే స్పెషల్..!!

తొలివేడుక ఇదే..

అంజలి పిక్చర్స్ బ్యానర్‌పై నటి అంజలి దేవీ, అక్కినేని నాగేశ్వరరావు హీరోగా ఆదినారాయణరావు నిర్మించిన సువర్ణ సుందరి సినిమా 1957 మే 10న విడుదలైంది. ఉమ్మడి రాష్ట్రంలోని 18 కేంద్రాల్లో 100 రోజులు ప్రదర్శించబడింది. కరీంనగర్‌లోని రోజ్ టాకీస్‌లో ఈ చిత్రం 100 రోజులు విజయవంతంగా ప్రదర్శింపబడిన సందర్భంగా విజయోత్సవం నిర్వహించారు. విజయోత్సవయాత్రలో భాగంగా అక్కినేని నాగేశ్వరరావు, అంజలిదేవీ, తదితరులు రోజ్‌టాకీస్‌కు వచ్చి ప్రేక్షకులతో వేడుకలు జరుపుకున్నారు.

కరీంనగర్‌ది ప్రత్యేక స్థానమే..

తెలుగు చలనచిత్ర చరిత్రలో కరీంనగర్ జిల్లాది ఎప్పటికీ ప్రత్యేకస్థానమే. జిల్లాకు చెందిన బీఎస్ నారాయణ తన సినిమాల ద్వారా తెలంగాణ సినీ చరిత్రను ప్రపంచానికి చాటారు. జాతీయస్థాయిలో మొదటిసారిగా ఉత్తమ నటి, రెండు జాతీయ అవార్డులను నిమజ్జనం చిత్రం ద్వారా అందించి కరీంనగర్ చిత్రకీర్తిని చాటారు. 1991లో కరీంనగర్‌లోని ఔత్సాహిక నటులతో 'మార్గదర్శి' చిత్రం ఉత్తమ జాతీయ సమైఖ్యత చిత్రంగా నిలిచి నందిఅవార్డు గెలుచుకుంది. 'నన్ను దోచుకుందువటే వన్నెలదొరసాని' పాటతో చిత్రరంగంలో ప్రవేశించిన జ్ఞానపీఠఅవార్డు గ్రహీత, డాక్టర్ సి.నారాయణరెడ్డి, దాదా సాహెబ్ పాల్కే అవార్డు అందుకున్న పైడి జయరాజ్, హిందీ, తెలుగు భాషల్లో చిత్రాలు నిర్మించిన కేకేరెడ్డి, దర్శకుడిగా రాణించిన కె.రుష్యేందర్‌రెడ్డి, తెలుగు సినిమాలో కరీంనగర్ తడాఖా చూపిస్తున్న సంపత్ నంది, హరీశ్‌శంకర్, పత్తి సురేందర్‌రెడ్డి, పైడిపెల్లి వంశీ, వేణుశ్రీరాం, కస్తూరి శ్రీనివాస్, బలగం దర్శక నటుడు వెల్దండి వేణు ఉమ్మడి జిల్లాకు చెందినవారే. వీరేకాకుండా కొత్తనటులు, దర్శకులు సినీరంగంలో కరీంనగర్ ఖ్యాతిని ఇప్పటికీ చాటుతున్నారు.

నాడు వైశ్యభవన్



కరీంనగర్‌లో వైశ్యభవన్

కరీంనగర్‌లోని గాంధీరోడ్‌లో ఉన్న వైశ్యభవన్ నాడు సినిమా విజయోత్సవ వేడుకలకు వేదికగా నిలిచింది. కరీంనగర్‌లో తొలిసారిగా పిట్టలదొర సినిమా 50రోజుల వేడుక జరిగింది. చొప్పదండికి చెందిన భాగ్యలక్ష్మి సాన క్రియేషన్ బ్యానర్‌పై 1996లో సాన యాదిరెడ్డి దర్శకత్వంలో అలీ, ఇంద్రజా జంటగా నటించిన పిట్టల దొర సినిమా 50రోజుల వేడుకలను వైశ్యభవన్‌లో నిర్వహించారు. ఈ వేడుకల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు డిస్ట్రిబ్యూషన్ తీసుకున్న కటకం వెంకటరమణ, చిత్ర నటీనటులు, సాంకేతిక సిబ్బందిని ఘనంగా సన్మానించారు. 1997లో ఒసేయ్ రాములమ్మ సినిమా విజయోత్సవ వేడుకకూడా ఇక్కడే నిర్వహించారు. కరీంనగర్‌కు వచ్చిన దాసరి నారాయణరావు, విజయశాంతి, తదితరులను ఘనంగా సత్కరించారు. అదే విధంగా 1998లో రవీంద్రఆర్ట్స్ బ్యానర్‌పై నటి రోజా ప్రధాన పాత్రలో నటించిన స్వర్ణక్క సినిమా ఆడియో రిలీజ్ ఫంక్షన్‌ను గాంధీరోడ్‌లోని సంస్కృతిక పాఠశాల మైదానంలో నిర్వహించారు. ఈ వేడుకల్లో తమ్మారెడ్డి భరద్వాజ, నటి రోజా, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం ఏర్పడిన తరువాత



తిరుమలటాకీస్‌లో హీరో బాలకృష్ణ

నందమూరి బాలకృష్ణ నటించిన 100 చిత్రం గౌతమీపుత్ర శాతకర్ణి ట్రైలర్‌ను తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తొలిసారిగా 2016 డిసెంబర్ 16న కరీంనగర్‌లోని తిరుమల థియేటర్‌లో రిలీజ్ చేశారు. బాలకృష్ణతోపాటు చిత్ర యూనిట్ పాల్గొన్నారు. కార్తికేయ, నేహా సోలాంకీ హీరో, హీరోయిన్‌గా నటించిన 90 ఎంఎల్ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలు 2019 డిసెంబర్ 1న కరీంనగర్‌లో జరిగాయి. ముఖ్య అతిథిగా మంత్రి గంగుల కమలాకర్, సినిమా హీరో, హీరోయిన్, యునిట్ సిబ్బంది పాల్గొన్నారు. వీటితో పాటు మరికొన్ని సినిమాల విజయోత్సవ వేడుకలు, ఇతర ఫంక్షన్లు జరిగాయి.

ఈ ఏడాదిలో నాలుగు ఫంక్షన్లు..



రాజ్‌కహానీ విజయోత్సవ సభ

2023లో ఈ మూడున్నర నెలల వ్యవధిలో మూడు పెద్ద సినిమాల ఫంక్షన్లు కరీంనగర్ వేదికగా జరిగాయి. మార్చి 12న రాంనగర్ మార్క్‌ఫెడ్ మైదానంలో విశ్వక్‌సేన్ నటించి, దర్శకత్వం వహించిన దస్ కా దమ్కీ సినిమా ట్రైలర్ లాంచ్ చేశారు. సిరిసిల్లకు చెందిన వెల్దండి వేణు నటించిన బలగం సినిమా విజయోత్సవాన్ని 2023 మార్చి 15న కరీంనగర్‌లోని జ్యోతిరావుపూలే మైదానంలో నిర్వహించారు. మార్చి 24న కరీంనగర్‌కు చెందిన కార్తికేయ హీరోగా నటించిన రాజ్ కహానీ చిత్రం విజయోత్సవ సభను తిరుమల థియేటర్‌లో నిర్వహించారు. ఏప్రిల్ 5న నాని హీరోగా నటించిన దసరా సినిమా విజయోత్సవాన్ని ఎస్సారార్ కాలేజీ మైదానంలో నిర్వహించారు. ఈనెల 27న విశ్వతేజ్ నటించిన కౌశిక్‌వర్మ దమయంతి సినిమా ఆడియోఫంక్షన్ కరీంనగర్‌లో జరగనుంది.

లయన్స్ క్లబ్ అధ్యక్షురాలిగా విజయలక్ష్మి



తానిపర్తి విజయలక్ష్మి



బంక కళావతి



మనీషా అగర్వాల్

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం లయన్స్ క్లబ్ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. 52 ఏళ్ల చరిత్ర కలిగిన రామగుండం లయన్స్ క్లబ్‌కు తొలిసారిగా మహిళా నాయకులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం రాత్రి జరిగిన సమావేశంలో 2023–24 సంవత్సరానికి కొత్త మహిళా ప్రతినిధుల నాయకత్వాన్ని క్లబ్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన కొత్త కార్యవర్గాన్ని శనివారం నామినేషన్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి గంగాధర్ ప్రకటించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షురాలిగా తానిపర్తి విజయలక్ష్మి ఎన్నికయ్యారు. ఆమె ప్రస్తుతం రామగుండం నగరపాలక సంస్థలో కోఆప్షన్ సభ్యురాలిగా వ్యవహరిస్తున్నారు. అలాగే ఉపాధ్యక్షురాలిగా కజాంపురం జయప్రద, ప్రధాన కార్యదర్శి బంక కళావతి, కోశాధికారి మనీషా అగర్వాల్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొత్త కార్యవర్గం ఈ ఏడాది జూన్ నుంచి బాధ్యతలు నిర్వహిస్తారని ప్రకటించారు. గోదావరిఖని లయన్స్ క్లబ్ ఆవరణలో జరిగిన సమావేశంలో సీనియర్ ప్రతినిధులు ముద్దసాని ప్రమోద్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ వెంకటేశ్వర్లు, ఇఎ.వెంకట్‌రెడ్డి, బంక రామస్వామి, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు తానిపర్తి గోపాల్‌రావు, మనోజ్‌కుమార్ అగర్వాల్, ఇ.లక్ష్మారెడ్డి, బేనిగోపాల్ త్రివేది, గుగ్గిళ్ళ రవీంద్రాచారి, కజాంపురం రాజేందర్, మల్లికార్జున్, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

నారాయణకు ఓయూ డాక్టరేట్



నారాయణ

సుల్తానాబాద్: పెద్దపల్లి మండలం అప్పన్నపేటకు చెందిన భూపల్లి నారాయణకు ఓయూ డాక్టర్ ప్రదానం చేశారు. ఓయూ ఇంగ్లిష్ ప్రొఫెసర్ గోపాల్‌రావు పర్యవేక్షణలో డాక్టరేట్ అందించారు. 'నిహిలిజం టు అఫర్మేషన్ ఎ స్టడీ ఆఫ్ సెలెక్టెడ్ వర్క్స్ ఆఫ్ ఎర్నెస్ట్ హెమింగ్వే అండ్ స్కాట్ ఫిట్జ్‌'రాల్డ్' అనే అంశంపై పరిశోధన చేసినందుకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ అందించింది.

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి

ఓదెల(పెద్దపల్లి): కాజీపేట్ – బల్లార్షా సెక్షన్ల మధ్యలో ఓదెల (గొల్లపల్లి) గ్రామానికి చెందిన బొయిని ఓదెమ్మ(75) పట్టాలు దాటుతుండగా గూడ్సురైలు ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడింది. చికిత్స పొందుతూ మృతిచెందింది. జీఆర్‌పీఎఫ్ రామగుండం హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి కథనం ప్రకారం.. ఓదెమ్మ పట్టాలు దాటుతుండగా అప్ వైపున వస్తున్న గూడ్సురైలు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. చికిత్స కోసం సుల్తానాబాద్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించటంతో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

'కేసీఆర్‌ది కుటుంబ పాలన'

ఓదెల: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ కుటుంబపాలన కొనసాగిస్తున్నారన్నారని, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి తెలిపారు. శనివారం ఓదెల మండలం కొలనూర్‌లో నిర్వహించిన బీజేపీ కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో అవినీతి ప్రభుత్వం నడుస్తోందని, అన్నివర్గాల ప్రజలను మోసం చేసిన సీఎంకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని వివరించారు. రాబోయే ఎన్నికల్లో ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడిన వారికి చెంపపెట్టు తప్పదన్నారు. గ్రామాల్లో బూత్ కమిటీలను బలోపేతం చేయాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య, బీజేపీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షుడు మీస అర్జున్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె సంజీవరెడ్డి, మండల అధ్యక్షుడు శనిగరపు రమేశ్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు పుల్లూరి పృథ్వీరాజ్, కొంగర అనిల్, ప్రధాన కార్యదర్శి నర్సింహచారి, నాయకులు పాల్గొన్నారు.

11వ వేతన ఒప్పందం పూర్తి చేయాలి



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న నర్సింహారావు

గోదావరిఖని(రామగుండం): బొగ్గు గని కార్మికుల 11వ వేతన ఒప్పందాన్ని వెంటనే పూర్తి చేయాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి, వేజ్ బోర్డు సభ్యుడు మంద నర్సింహారావు డిమాండ్ చేశారు. శనివారం జీడీకే–11గనిలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. వేతన ఒప్పందం ఆలస్యానికి పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వాన్నిదేనని అన్నారు. గని కార్మికుల పోరాటంతోనే కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి 11వ వేతన ఒప్పందంలో 60 డిమాండ్లు పెట్టినప్పటికీ ఇప్పటికీ జరుగుతున్న చర్చల్లో ఐదు సంవత్సరాల వేతన ఒప్పందం ఉండాలని, 19శాతం మినిమం గ్యారంటీ బెనిఫిట్‌తో అగ్రిమెంట్ చేసుకోవడం జరిగిందన్నారు. మిగతా అలవెన్స్‌లు, ఎల్‌టీసీ, ఎల్ఎల్‌టీసీ, పెన్షన్ స్కీం, లీవులు, మెడికల్ స్కీం తదితర మిగిలిపోయిన 58 డిమాండ్లపై ఈనెల 18న చర్చలు జరగనున్నాయని పేర్కొన్నారు. చర్చలు వాయిదాలు వేయకుండా పూర్తి స్థాయిలో అగ్రిమెంటు జరగడం కోసం కృషి చేస్తామని తెలిపారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి మాట్లాడుతూ, కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో యాజమాన్యం పూర్తిగా విఫలమైందన్నారు. స్థానికంగా కార్మికవాడల్లో ఎక్కడికి వెళ్లినా డ్రైనేజీ, రోడ్లు, తాగునీటి సమస్యలతో కార్మిక కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు మెండె శ్రీనివాస్, ఆరేపల్లి రాజమౌళి, జెల్ల గజేంద్ర, అన్నం శ్రీనివాస్, ఇప్పలపల్లి సతీష్, మొగిలి, మహేందర్, మునుకుంట్ల రామన్న, తిరపతిరెడ్డి, శివరాంరెడ్డి, రాజేందర్‌రెడ్డి, సుమన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు నిర్వహిస్తారా.. చర్చలకు పిలుస్తారా..

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సీతారామయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సీతారామయ్య

గోదావరిఖని(రామగుండం): గుర్తింపు యూనియన్ ఎన్నికలు నిర్వహిస్తారా లేక అన్ని యూనియన్లను చర్చలకు పిలుస్తారా? అని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. శనివారం యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించడం ఇష్టం లేకపోతే కార్మికుల సమస్యలపై అన్ని యూనియన్లతో సంప్రదింపులు జరపాలన్నారు. వేరే యూనియన్ గెలిస్తే వాళ్ల పైరవీలు నిలిచిపోతాయనే ఆలోచనతో గుర్తింపు యూనియన్ సింగరేణిలో ఎన్నికలు జరుగకుండా అడ్డుకుంటుందన్నారు. 11వ వేజ్ బోర్డు ఒప్పందం కేంద్ర ప్రభుత్వం వల్లే ఆలస్యం జరుగుతుందని ఆరోపించారు. ఈనెల18,19 తేదీల్లో కోల్‌కత్తాలో జరిగే వేజ్‌బోర్డు సమావేశంలో అలవెన్సులు, రిటైర్డ్ కార్మికుల సమస్యలపై మాట్లాడుతామని పేర్కొన్నారు. గైడ్ లైన్స్‌తో సంబంధం లేకుండా వేజ్ బోర్డు ఒప్పందం చేయకుంటే అన్ని యూనియన్‌లతో కలిసి సమ్మె నోటీసు ఇస్తామన్నారు. సమావేశంలో ఎల్.ప్రకాశ్, కె.రాజ్‌కుమార్, వైవీ రావు, ఆరెల్లి పోషం, రంగు శ్రీనివాస్, అన్నారావు, బుర్ర తిరుపతి, శనగల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లరికల్ ఇన్‌చార్జిగా శ్రీనివాసరావు

ఏఐటీయూసీ రామగుండం రీజియన్ క్లరికల్ ఇన్‌చార్జిగా శ్రీనివాసరావును నియమించారు. శనివారం భాస్కర్‌రావుభవన్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో సీతారామయ్య ప్రకటించారు. అలాగే సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రామగుండం రీజియన్ ఇన్‌చార్జిగా బుర్ర తిరుపతి, ఆర్జీ–1 సివిల్ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జిగా తాని రాజబాబును నియమించారు.

చిన్నారుల మృతికి సీపీఎం సంతాపం



చిన్నారుల మృతికి సంతాపంగా నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

జ్యోతినగర్(రామగుండం): చెరువులో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందిన ముగ్గురు చిన్నారులకు సీపీఎం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ ఇందిరమ్మకాలనీ శివారు మేడిపల్లి చెరువులో శుక్రవారం న్యూపోరట్‌పల్లికి చెందిన ఉమామహేశ్వర్, విక్రం, సాయిచరణ్ మృతి చెందారు. ఈ మేరకు ఎన్టీపీసీ రామగుండం ఏరియా కార్యదర్శి ఎం.రామాచారి, గీట్ల లక్ష్మారెడ్డిల ఆధ్వర్యంలో భూపోరాట కేంద్రం వద్ద మృతులకు నివాళులర్పించి 2 నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చిన్నారుల మృతి తల్లిదండ్రులకు తీరని లోటని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదాలు జరుగకుండా చెరువులు, కుంటల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, చెరువుకు కంచె ఏర్పాటు చేసి కాపలాదారును నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రమణ, సురేష్, దేవేంద్ర, భాగ్య, సుజాత, మహాలక్ష్మి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ప్రతిష్టను దెబ్బతీస్తున్న రాష్ట్ర ప్రభుత్వం



గేట్‌మీటింగ్‌లో మాట్లాడుతున్న సత్తయ్య

గోదావరిఖని(రామగుండం): రాష్ట్ర ప్రభుత్వం కావాలనే అప్పుల్లోకి నెట్టి సింగరేణి ప్రతిష్టను దెబ్బతీస్తోందని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య విమర్శించారు. శనివారం ఆర్జీ–1 ఏరియా వర్క్‌షాప్‌లో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. ప్రైవేటీకరణ రాష్ట్ర ప్రభుత్వ జోక్యంతోనే జరుగుతుందన్నారు. భూగర్భగనుల మూసివేత శరవేగంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. 2014 నాటికి 35 భూగర్భ గనులు ఉండగా, నేడు 24 మాత్రమే ఉన్నాయన్నారు. దీంతో 20వేల మంది కార్మికుల సంఖ్య తగ్గిపోయిందని, ఇది ప్రయివేటీకరణ కాదా అని ప్రశ్నించారు. రూ.3,500 కోట్లు నిల్వ ఉన్న సంస్థ నేడు రూ.12,500 కోట్ల అప్పుల్లో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెల్లించవలసిన విద్యుత్తు, బొగ్గు బకాయిలు రూ.25వేల కోట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సంస్థలో ప్రైవేటీకరణ వెంటనే నిలిపివేయాలని, సెక్యూరిటీ విభాగం, ఏరియా హాస్పిటల్స్, ఓపెన్‌కాస్టుల్లో ప్రయివేటీకరణ పెరిగిపోయిందన్నారు. సమావేశంలో నాయకులు ఆకుల హరిణ్, కేంద్ర ఉపాధ్యక్షులు వై.సారంగపాణి, భాస్కర్, కోటయ్య, శ్రీనివాస్, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): ఆర్థిక ఇబ్బందులతో మండలంలోని గంగారం గ్రామానికి చెందిన చల్లా సమ్మిరెడ్డి(55) శనివారం పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రాజవర్ధన్ వివరాల ప్రకారం.. సమ్మిరెడ్డి తాను పొలం వద్ద పురుగుల మందు తాగినట్లు హైదరాబాద్‌లో ఉన్న తన కుమారుడు సతీశ్‌రెడ్డికి ఫోన్ చేశాడు. వెంటనే సతీశ్ రెడ్డి గ్రామస్తులకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. ఈక్రమంలో సమ్మిరెడ్డిని చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

‘చిందూ’ చిన్నబోయింది..

- ప్రాచీన కళలకు ఆదరణ కరువు
- కళలను పట్టించుకోని జనాలు
- ఆధునిక టెక్నాలజీతో కులవృత్తి కళలు మాయం
- దుర్భరంగా వృత్తి కళాకారుల జీవితాలు

సండే స్పెషల్



గ్రామాల్లో చిందూల యక్షగాన ప్రదర్శన

జూలపల్లి: ఆధునిక టెక్నాలజీ పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజల జీవన ముఖ చిత్రం మార్చి వేసింది. గతంలో ప్రజలను విశేషంగా ఆకట్టుకున్న ప్రాచీన కళలు నేడు ఆదరణకు నోచుకోలేక కనుమరుగవుతున్నాయి. వీటిలో ప్రధానంగా చెప్పుకొదగిన కళలు చిందూ బాగోతం, యక్షగానం ఉన్నాయి. చిందూ కళాకారులు ప్రధానంగా దళిత కాలనీల్లో బాగోతం ఆడుతూ వారి వద్ద త్యాగం అడుక్కుని జీవిస్తూ ఉండేవారు. ఇతర కులాల వారిని తమ యక్షగాన ప్రదర్శనతో మెప్పించి వారు ఇచ్చే వాటితో కడుపు నింపుకునే వారు. ఆధునిక టెక్నాలజీ అందుబాటులోకి రావడం, టీవీలు, సెల ఫోన్లు, ఇంటర్ నెట్ అందుబాటులో రావడంతో ప్రాచీన కళా ప్రదర్శనలకు ఆదరణ కరువైంది.. తమకు ఎన్నో ఎళ్లుగా తిండి పెట్టిన కళను వదిలి ఇతర ఉపాధి మార్గాల వైపు మళ్లారు. కళాకారులు తమ వృత్తిని వదిలి పట్నం వైపు వెళ్లి తమకు తోచిన పనుల్లో చేరి ఉపాధి వెతుక్కున్నారు.

యక్షగాన ప్రదర్శన చూసేందుకు పోటీ ..

గ్రామాల్లో చిందూ భాగోతం వేస్తున్నామని చాటింపు వేయగానే గ్రామస్తులు కూర్చోవడానికి జాగ దొరకదని ముందుగా వెళ్లి ఆపుకునే వారు. అలాంటి చిందూ బాగోతాన్ని ఇప్పుడు చూసే వారు లేక కనుమరుగైంది. గతంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 140 కుటుంబాలు ఈ కళ పై ఆధారపడి జీవిస్తుండేవని ఒక కళాకారుడు తెలిపారు. గ్రామాలను పంచుకుని చిందూ కుటుంబాలు తమ కళను ప్రదర్శించి పొట్ట నింపుకునే వారు. కళను ఆదరించే వారు లేక బతుకుదెరువు లేక ఉన్న ఊరును వదిలి బతుకుదెరువు కోసం పట్నం వైపు వెళ్లి ఉపాధి చూసుకున్నారు. ప్రభుత్వం తమ కళను బతికించుకునేందుకు సాయం చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, దళితబంధు, స్వయం ఉపాధి రుణాలు అందించాలని కోరారు.

మాయమైన కులవృత్తుల కళలు..

గతంలో వేకువ జామునే వచ్చే రామజోగుల వాళ్లు తమ వృత్తిని వదిలేశారు. ప్రస్తుతం చిందూ బాగోతం, బుడబుక్కల, మందుచ్చవాళ్లు, మంద గొల్ల, సాధన శూరులు, పాండవులవాళ్లు, గుర్రపు వాళ్లు, బుడిగె జంగాల, మిత్తుల, గంటె బాగోతుల, గంగిరెద్దుల, బాలసంతుల, కళలు పూర్తిగా మాయమయ్యాయి.

ప్రభుత్వం ఆదుకోవాలి..



చిందూ బాగోతం ఆడి బతుకుతుండే వాళ్లం. ప్రస్తుతం చూసేవారు లేక కళను వదిలి కూలీ చేసుకుంటున్నం. ప్రభుత్వం కళను బతికించేందుకు ప్రభుత్వ పథకాల ప్రచారంలో అవకాశం కల్పించాలి. ప్రతి కళాకారునికి పింఛన్ ఇవ్వాలి.స్వయం ఉపాధి పథకాలు అందించాలి. **– గడ్డం కనుకయ్య, చిందూ కళాకారుడు, అబ్బాపూర్**

దళిత బంధు ఇవ్వాలి..



మా బుడిగె జంగాల కథలను ప్రజలు చూడటం,వినడం మాని వేయడంతో మేము కళను వదిలి పెట్టాల్సి వచ్చింది. ప్రభుత్వం మాకు ‘దళిత బంధు’ పథకంలో ప్రాధాన్యత నిచ్చి ఆదుకోవాలి. స్వయం ఉపాధి కోసం పెట్టిన పథకాలు ఇచ్చి ఆదుకోవాలి. **– సంగెం మోహన్. మాల జంగం కళాకారుడు**

ఓపికతో చూసే వాళ్లం



30 ఏళ్లకు ముందు చిందూ బాగోతం వేస్తున్నారంటే ముందు జాగ ఆపుకుని చూసేవాళ్లం.ఆట ఆడే వాళ్లు ఎగిరినప్పుడు దుమ్ము లేచి మీద పడినా ఓపికగా కిందనే కూర్చుండి చూసేటోళ్లం. తెల్లవారేదాకా బాగోతం చూసేది. ఇప్పుడు ఆడిచ్చేవాళ్లు, ఆడేవాళ్లు లేరు, చూసే వాళ్లు కూడా లేరు. **– బైర బక్కయ్య అబ్బాపూర్**

క్లుప్తంగా

ఉపాధి హామీ పనులు పరిశీలన



ఉపాధి పనులు పరిశీలిస్తున్న అధికారులు

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శనివారం ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఎంపీవో అనిల్‌రెడ్డి పరిశీలించారు. గ్రామంలోని ఎస్సారెస్పీ కెనాల్‌లో పూడిక తీస్తున్న తీరును, వేసవిలో కూలీలకు సౌకర్యాలను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కెనాల్ పూడికతీత తో రైతులకు సక్రమంగా సాగునీరు అందించేందుకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గొల్లె కావేరి, పీఆర్ ఏఈ జగదీష్, మాజీ ఎంపీటీసీ గొల్లె భూమేశ్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



పట్టుబడ్డ ఇసుక ట్రాక్టర్లు

సుల్తానాబాద్: మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న తొమ్మిది ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు పట్టుకుని కార్యాలయానికి తరలించారు. మండలంలోని గట్టెపల్లి, నీరుకుళ్ల గ్రామాల నుంచి అక్రమంగా ఇసుక తరలుతోందని స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు దాడులు చేసి పట్టుకున్నట్లు తహసీల్దార్ యాకన్న తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ట్రాక్టర్లకు జరిమానా విధించనున్నట్లు పేర్కొన్నారు.

అయ్యప్ప స్వామి ఆలయంలో విషుపూజ మహోత్సవం



పూజలో పాల్గొన్న భక్తులు

యైటింక్లయిన్‌కాలనీ: అయ్యప్ప విషుపూజ మహోత్సవం సందర్భంగా యైటింక్లయిన్ కాలనీ శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకు అయ్యప్ప స్వామి మూలవిరాట్‌కు పాలపంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు అర్చన, హారతి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమంలో శ్రీ సారంగ చారి, ఆలయ కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, కమిటీ సభ్యులు సురేశ్, విజేందర్ రెడ్డి, రాయమల్లు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం



బహుమతులు అందిస్తున్న జడ్జి భారతి

మంథని: అంబేడ్కర్ జయంతి సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఇ. భారతి బహుమతులు అందజేశారు. అంబేడ్కర్ భారత ప్రజలందరికీ సమాన హక్కులు, బాధ్యత రాజ్యాంగంలో పొందుపరిచారని, వాటిని ఉపయోగించుకుని సమాజంలో అసమానతలను రూపుమాపాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రఘోత్తంరెడ్డి, న్యాయవాదులు సదన్‌కుమార్, శశిభూషణ్ కాచే పాల్గొన్నారు.

ఆర్థికసాయం

జూలపల్లి: మండలంలోని అబ్బాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద బొంగాని రాజేశం అనారోగ్యంతో బాధ పడుతున్న విషయాన్ని కొలుముల దామోదర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు దామోదర్ దృష్టికి తీసుకెళ్లగా, స్పందించి రూ.5 వేలు పంపించారు. సర్పంచ్ ఈర్ల మల్లేశం, కొమ్మ రాజేశం ఫౌండేషన్ సభ్యులు రాజేశంకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కచ్చు బీరయ్య, కత్తెర్ల వెంకటయ్య, గాండ్ల రాజు,పప్పు కుమార్, పాల్గొన్నారు.

మంత్రికి కృతజ్ఞతలు

రామగుండం: దేశంలోనే అతి పెద్ద అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు కృషి చేసిన సీఎం కేసీఆర్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌కు పెద్దపల్లి జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడు భుక్యా సాయిరామ్ నాయక్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని కేటీఆర్ క్యాంపు కార్యాలయంలో కేటీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ



సత్యనారాయణ గౌడ్

కమాన్‌పూర్: కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయకుడు రంగు సత్యనారాయణ గౌడ్‌ను నియమించినట్లు ఏఐసీసీ కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. తన నియామకానికి సహకరించిన అందరికీ సత్యనారాయణ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

సుల్తాన్‌పూర్ పద్మశాలీ సంఘం కమిటీ ఎన్నిక

ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్ పద్మశాలీ సంఘం కమిటీని శనివారం ఆ సంఘం మండల అధ్యక్షుడు మామిడాల రమేశ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆడెపు కుమార్, గౌరవ అధ్యక్షుడిగా ఆడెపు కనుకయ్య, ఉపాధ్యక్షుడిగా ఆడెపు రమేశ్, కోశాధికారిగా అడిగొప్పుల చిరంజీవి, ప్రధాన కార్యదర్శిగా పోలు రాజేశం, సహాయ కార్యదర్శిగా అడిగొప్పుల మల్లేశం, కార్యవర్గ సభ్యులుగా భూర్ల మార్కండేయ, వేముల కనుకయ్య, ఆడెపు మహేశ్,కొండ రవి,ఆడెపు వెంకటేశం, ఓద్నాల శ్రీనివాస్ ఎన్నికైనట్లు మండల అధ్యక్షుడు రమేశ్ తెలిపారు.

ధర్మారం మజీద్ కమిటీ అధ్యక్షుడిగా ఎండీ జహీర్

ధర్మారం: మండల కేంద్రం మజీద్ కమిటీ అధ్యక్షుడిగా ఎండీ జహీర్ ఎకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం ధర్మారంలో నిర్వహించిన మసీద్ కమిటీ సర్వసభ్య సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జహీర్, గౌరవ అధ్యక్షుడిగా ఎండీ గౌస్‌బాబా, ఉపాధ్యక్షులుగా ఎండీ అల్లావుద్దీన్, ఎండీ ఆవేజ్, ప్రధాన కార్యదర్శిగా ఎండీ మిస్బా, కోశాధికారిగా ఎండీ యూసుఫ్, కార్యదర్శులుగా జబ్బార్, సైఫ్, ప్రచారకార్యదర్శులుగా ఎండీ షోయాబ్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సలహాదారులుగా ఎండీ హుస్సేన్, అబ్దుల్ ముజాహిద్, ఎండీ బాబా, ఎన్నికల ఇన్‌చార్జిలుగా అబ్దుల్ షఫీ, ఎండీ హఫీజ్ వ్యవహరించారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మె నోటీస్



కాల్వశ్రీరాంపూర్‌లో నోటీస్ ఇస్తున్న కార్యదర్శులు

ఎలిగేడు: రాష్ట్ర ప్రభుత్వం తమ డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని కోరుతూ మండలంలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు శనివారం ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఎంపీవో అనిల్‌రెడ్డికి సమ్మె నోటీస్ అందజేశారు. 4 ఏళ్లు ముగిసినా కార్యదర్శులను రెగ్యులర్ చేయలేదని, దీనిపై ఈనెల 28 నుండి నిరవధిక సమ్మెకు వెళతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మహేందర్‌రెడ్డి, అభిజిత్, సౌమ్య, కార్యదర్శులు పాల్గొన్నారు.

జూనియర్ పంచాయితీ కార్యదర్శుల సమ్మె నోటీస్

కాల్వశ్రీరాంపూర్: నాలుగేళ్లుగా చాలీచాలని వేతనాలతో ఉద్యోగాలు నెట్టుకొస్తున్నామని ప్రభుత్వం తమను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి, క్రమబద్ధీకరణ చేయాలని పంచాయతీ కార్యదర్శులు డిమాండ్ చేశారు. తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని శనివారం ఎంపీడీవో, ఎంపీవోకు సమ్మె నోటీస్ అందజేశారు. ప్రభుత్వం తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరణ చేయాలని లేనిపక్షంలో నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు అమ్జద్, నయీమ్, సతీశ్, రాజ్‌కుమార్, రాజేశ్, వెంకన్న నాయక్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి: గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం ఎంపీడీవో లలితకు సమ్మె నోటీసు అందజేశారు. పంచాయతీ కార్యదర్శుల ప్రొబేషన్ కాల పరిమితి ముగిసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులర్ చేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తమను రెగ్యులరైజ్ చేయడంతో పాటు పలు పెండింగ్ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ 15 రోజుల నోటీస్ పీరియడ్ అనంతరం ఈనెల 28వ తేదీ నుంచి నిరవధిక సమ్మెను చేపడతామని నోటీస్‌లో పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు మేర్గ నరేశ్, శ్రీనివాస్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



సామగ్రి అందిస్తున్న వైస్ చైర్మన్ సమత

సుల్తానాబాద్: బాలికలు ఆరోగ్య పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత అన్నారు .శనివారం సుల్తానాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆచార్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలికల ఆరోగ్య పరిశుభ్రత అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కౌమారదశ బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత అవసరమన్నారు. రుతుక్రమ దశలో ఎదురయ్యే సమస్యల పై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని కోరారు. పరిశుభ్రతకు ప్రేరణగా నిలుస్తాయని తెలిపారు.హెచ్‌ఎం విజయరావు మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి ప్రతీ నిత్యం వ్యాయామం, మానసిక ప్రశాంతత కోసం యోగా ధ్యానంతో ఒత్తిడి లేని జీవన విధానం అలవర్చుకోవాలని కోరారు. విద్యార్థినులకు శానిటరీ నాప్‌కిన్‌లు అందించారు.కార్యక్రమంలో ఆచార్య ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ జవ్వాజి రాజేశ్, కొమిరిశెట్టి రమేశ్, కుంకుమల్ల మహేశ్, బురుగు అంజయ్య, బి. కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు కృషి

- ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టులు

సుల్తానాబాద్: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు చొరవ తీసుకుంటానని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు బుర్ర సంపత్ గౌడ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని పత్రికలు నెగెటివ్ వార్తలకే ప్రాధాన్యం ఇస్తున్నాయని, నిజాలు రాయాల్సిన బాధ్యత జర్నలిస్టులందరిదన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పటికే పరిశీలించామని, సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి అందరికీ పట్టాలు పంపిణీ చేసేలా చూస్తామన్నారు. జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని పేర్కొన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు బుర్ర సంపత్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ టీకే శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణదాసు అశోక్, జిల్లా కార్యదర్శి బాలసాని రాజయ్య, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు టీకే రమేశ్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

జర్నలిస్టు శ్రీకాంత్‌కు ఘన నివాళి

ఇటీవల మృతి చెందిన రామగిరి మండల రిపోర్టర్ పొన్నం శ్రీకాంత్ ఆత్మ శాంతించాలని జర్నలిస్టులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఐజేయూ జిల్లా అధ్యక్షుడు బుర్ర సంపత్ కుమార్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ టీకే శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణ దాసు అశోక్ ఉన్నారు.

ముస్లింల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ముస్లింల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. శనివారం రాత్రి సుల్తానాబాద్ పద్మనాయక కల్యాణ మండపంలో ముస్లిం లకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ముత్యం సునీత, వైస్ చైర్మన్ బిరుదు సమత, ఎంపీపీ బాలాజీ రావు, ఏఎంసీ చైర్మన్ బుర్ర మౌనిక, పట్టణ అధ్యక్షుడు గుణపతి, యూత్ అధ్యక్షుడు వహీద్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని లింగాపూర్‌లో ట్రాన్స్‌కో ఏఈ బేతి దామోదర్‌రావు మరో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం ప్రారంభించారు. ఇప్పటివరకు లోఓల్టేజీతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గ్రామస్తుల విన్నపం మేరకు మరో ట్రాన్స్‌ఫార్మర్ కేటాయించడంతో లోఓల్టేజీ సమస్య తీరినట్లయింది. ఈ సందర్భంగా ఏఈకి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

సమ్మయ్యకు దళితరత్న అవార్డు

గోదావరిఖని టౌన్: టీఎంహెచ్‌డీ జిల్లా అధ్యక్షుడు కనుకుట్ల సమ్మయ్య దళితరత్న అవార్డు అందుకున్నారు. శుక్రవారం రాత్రి హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో కనుకుట్ల సమ్మయ్యకు తెలంగాణ మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు జన్ను కనకరాజు, ప్రధాన కార్యదర్శి కుశనపల్లి రవి, రాజలింగం, టీఎంహెచ్‌డీ అధ్యక్షుడు మల్లేశ్ సత్కరించి దళితరత్న అవార్డు అందజేశారు.

దళితరత్న అవార్డు గ్రహీతకు సన్మానం

ధర్మారం: మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ, దళితరత్న అవార్డు గ్రహీత బొల్లి స్వామిని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు.

గాయపడ్డ విద్యార్థికి ఉచిత విద్య

మంథని: మంథనిలోని కాకతీయ పాఠశాలలో చదివే ఖానాపూర్ గ్రామానికి చెందిన రాపాక యశ్వంత్ భట్టుపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కుడి చేయి కోల్పోయాడు. ఈ మేరకు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు ఆ విద్యార్థి వైద్య ఖర్చులకు రూ. 20 వేలు సాయం అందించారు. పదో తరగతి వరకు ఉచితవిద్యను అందిస్తామని భరోసా కల్పించారు. ప్రిన్సిపాల్ ప్రదీప్‌రెడ్డి, డైరెక్టర్లు కిరణ్‌రెడ్డి, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

రత్నాపూర్ అభివృద్ధికి రూ.10 లక్షల నిధులు మంజూరు

కమాన్‌పూర్: రామగిరి మండలంలోని రత్నాపూర్‌కు రూ. 10 లక్షల నిధులు మంజూరైనట్లు సర్పంచ్ పల్లె ప్రతిమ తెలిపారు. ఈ నిధులతో సీసీరోడ్లు, సైడ్ వాల్స్ నిర్మాణం చేపడతామని సర్పంచ్ తెలిపారు. నిధులు మంజూరు చేయించిన జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకు సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు.

రేషన్‌షాపులో 12 రకాల వస్తువులు అందజేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మహిళలు

రామగుండం: రేషన్‌కార్డులు కలిగి ఉన్న ప్రతీ ఒక్కరికి 12 రకాల నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలని ప్రగతిశీల యువజన సంఘం, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రతినిధులు డిమాండ్ చేశారు. శనివారం అంతర్గాం మండల పరిధిలోని పలు గ్రామాల్లో నిరుపేదలైన లబ్ధిదారుల వివరాలను సేకరిస్తూ పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సందర్భంగా పీవోడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు కోడిపుంజుల లక్ష్మి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుపేదలకు అందజేస్తున్న దొడ్డు బియ్యం నాణ్యత ఉండడం లేదని, దళారులకు విక్రయిస్తుండడంతో నిరుపేదలకు ఎలాంటి లబ్ధి చేకూరడం లేదన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో సామాన్య మానవుడు బతకలేని పరిస్థితి నెలకొందన్నారు. రేషన్‌కార్డు కలిగి ఉన్న వారికి ప్రతీ నెల 10 కేజీల నాణ్యమైన సన్నబియ్యం, గోధుమలు, పప్పు దినుసులు, నూనె ప్యాకెట్‌లతో పాటు 12 రకాల నిత్యావసర వస్తువులను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ ప్రతినిధులు మార్త రాధ, కల్పన, రాజేశ్వర్, తిరుపతి, లావణ్య తదితరులున్నారు.

నీలి సైనికుల భారీ ర్యాలీ



అంబేడ్కర్ విగ్రహం ఎదుట దళిత ప్రతినిధులు

రామగుండం: భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతి సందర్భంగా శుక్రవారం రాత్రి స్థానిక రైల్వేస్టేషన్ నుంచి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా నీలి సైనికుల పేరుతో జై భీం నినాదాలతో అర్ధరాత్రి వరకు భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో మానవహారం ఏర్పాటు చేయగా, బాలికలు ప్రదర్శించిన అకాడ విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరికిళ్ల రాజనర్సయ్య, న్యాయవాది ఇరికిళ్ల నర్సయ్య, కార్పొరేటర్ ఇంజపురి పులేందర్, ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి దొమ్మాటి సదయ్య, తగరపు శంకర్, ఎస్సీ, ఎస్టీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధి వడ్డెపల్లి సురేష్, అంబేడ్కర్ అవార్డు గ్రహీత బుసిపాక సంతోష్ మహారాజ్, దళిత, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్ఆర్‌టీపీ నాయకులు

రామగుండం: టీఎస్‌పీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేసి ఉద్యోగ నోటిఫికేషన్ ప్రకటించాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 1.91లక్షల ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయాలని వైఎస్ఆర్‌టీపీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు టీ-సేవ్ పేరిట నియోజకవర్గ ఇన్‌చార్జి జిమ్మిబాబు ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిమ్మిబాబు మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ అంశాన్ని సీబీఐకి అప్పగించాలని, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, సత్వరమే ప్రవేశపరీక్ష నిర్వహించాలని పేర్కొన్నారు. నిరుద్యోగులకు భృతి చెల్లించాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు. దీక్షలో ఓఎల్.రెడ్డి, శ్యాంసన్, రమేశ్, వెంకట్, అనిల్, రాజమౌళి, బండ సతీష్, జెర్మియా, సుజ్ఞాని, రమేశ్, వినయ్, మహేశ్‌తదితరులున్నారు.

నేడు ఉచిత మెడికల్ క్యాంపు

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని అంగడి బజారులో నేడు ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు జంగపెల్లి అజయ్ తెలిపారు. కరీంనగర్‌కు చెందిన శ్రీకృష్ణ ఆర్థోపెడిక్ ఆస్పత్రి వారు మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

జూలపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి అధ్యక్షతన రేపు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వేణుగోపాలరావు తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి హాజరవుతున్నారని, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు సకాలంలో హాజరు కావాలని కోరారు.

రామగిరి మండల సమావేశం..

కమాన్‌పూర్: రామగిరి ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపీపీ అరెల్లి దేవక్క అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఇనుముల రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని పేర్కొన్నారు.

జర్నలిస్టు మృతికి సంతాపంగా కొవ్వొత్తుల ర్యాలీ

కమాన్‌పూర్: రామగిరి మండలానికి చెందిన పాత్రికేయుడు పొన్నం శ్రీకాంత్ అకాల మృతి పట్ల కమాన్‌పూర్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం కొవ్వొత్తులతో అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. శ్రీకాంత్ చిత్రపటానికి పూలమాల వేసి సంతాపం ప్రకటించి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సభ్యులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

రామగుండం: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం రామగుండం రైల్వేస్టేషన్ ఎదుట అగ్ని ప్రమాదాల నివారణపై ఫైర్ సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ఫైర్ విన్యాసాలు, ఆయిల్, చెత్తతో కృత్రిమంగా మంటలను సృష్టించి దానిని నివారించే విధానాలపై అవగాహన కల్పించారు. ఇంట్లో ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ లీకైతే ప్రమాదం వాటిల్లకుండా మంటలను ఆర్పే విధానాన్ని వివరించారు. రద్దీ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంటే నష్ట నివారణతో పాటు ప్రాణనష్టం సంభవించకుండా తీసుకోవాల్సిన చర్యలను చూపించారు. కార్యక్రమంలో రైల్వే ఏరియా ఆఫీసర్ మిథున్, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీఐ బుర్ర సురేశ్‌గౌడ్, ఫైర్ ఆఫీసర్ ఆర్.సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.